సాక్షి వరంగల్

ఆదివారం । 18 । మే । 2025



హోరాహోరీగా నెట్‌బాల్ పోటీలు

జనగామ జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంటలో నెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి.

- 8లో▸



లోకోపైలెట్ల గైర్హాజరుతో రైళ్లు రద్దు

కాజీపేట జంక్షన్ కేంద్రంగా ప్రయాణిస్తున్న పలు రైళ్లు లోకోపైలెట్ల గైర్హాజరుతో రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

- 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 37^{0} / 27^{0}

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి



విద్యారణ్యపురి: జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈఓ డాక్టర్ శ్రీధర్‌సుమన్ కోరారు. హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ల సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఉదయం ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈనెల 22 నుంచి నిర్వహించే పరీక్షలకు 16 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రథమ సంవత్సరం 3,135 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 2,065 మంది పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో డీఈసీ సభ్యులు మాధవరావు, విజయనిర్మల, స్క్వాడ్ బృందాలు, సీఎస్‌లు, డీఓలు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి : డీఈఓ



విద్యారణ్యపురి: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచాలని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను బోధించాలని డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్ ఉపాధ్యాయులను కోరారు. జిల్లాలోని ఉపాధ్యాయులకు నగరంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడారు. స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా కె.మల్లారెడ్డి, ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా ఉపాధ్యాయుల విద్యాబోధన ఉండాలని సూచించారు. వరంగల్ నార్కొటిక్ డీసీపీ సైదులు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ సుజన్‌తేజ, డీసీఈబీ కార్యదర్శి కృష్ణమూర్తి, కోర్సు కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు, సెంటర్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్‌రావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

22న భారత్ గౌరవ్ స్పెషల్ ట్రైన్

ఖిలా వరంగల్: అరుణాచలం, రామేశ్వరం, మధురై, శ్రీరంగం, తంజావూర్, కన్యాకుమారి తదితర ప్రాంతాలకు భారత్ గౌరవ్ (టూరిస్ట్) ట్రైన్ నడిపించనున్నట్లు ఐఆర్‌సీటీసీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ఈనెల 22న మధ్యాహ్నం 12 గంటలకు రైలు ప్రారంభమై భువనగిరి, జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం మీదుగా విజయవాడకు చేరుకుంటుందని పేర్కొన్నారు. ఇందులో స్లీపర్, థర్డ్ ఏసీలు ఉంటాయని, ప్యాకేజీ ప్రారంభం ధర రూ.14,250, స్లీపర్ రూ.14,700, థర్డ్ ఏసీ రూ.22,900 ఉందని తెలిపారు. ఈప్యాకేజీలో మూడు పూటల భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు, ప్రతి కోచ్‌లో ఐఆర్‌సీటీసీ సిబ్బంది అందుబాటులో ఉంటారని సౌత్ సెంట్రల్ జోన్, టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ కిశోర్ సత్యం పేర్కొన్నారు. ట్రైన్‌ను ఉమ్మడి జిల్లా ప్రజలు ఉపయోగించుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9701360701, 9281030712 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

భక్తులను క్షేమంగా చేరవేయాలి : ఆర్టీసీ ఆర్‌ఎం

హన్మకొండ: సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తులను క్షేమంగా తరలించాలని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను సూచించారు. శనివారం హనుమకొండ బస్ స్టేషన్‌లో కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు వెళ్లే ప్రత్యేక బస్సులను ఆయన పరిశీలించారు. శనివారం వరంగల్ రీజియన్ వ్యాప్తంగా 230 బస్సుల్లో 15 వేల మంది సరస్వతి పుష్కరాలకు తరలివెళ్లినట్లు ఆర్‌ఎం వివరించారు.

వివాహిత అదృశ్యం

నల్లబెల్లి: బ్యాంకులో ఖాతా తీసుకునేందుకు వెళ్లిన వివాహిత అదృశ్యమైంది. ఎస్సై గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ గ్రామానికి చెందిన కందికొండ రమ మహిళా సంఘం కోసం నర్సంపేట యూని యన్ బ్యాంకులో ఖాతా తీసుకునేందుకు వెళ్తానని శుక్రవారం భర్త కుమారస్వామికి తెలిపింది. కాగా, కుమారస్వామి తన భార్యను ద్విచక్రవాహనంపై మధ్యాహ్నం తీసుకెళ్లి రుద్రగూడెంలో దింపి తిరిగి ఇంటికి వెళ్లాడు. నర్సంపేటలోని యూనియన్ బ్యాంకుకు వెళ్లిన ఆమె రాత్రి వరకు ఇంటికి తిరిగిరాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియలేదు. భర్త కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



దీపం వెలిగించిన యువతి, గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతి నదిలో పుష్కరస్నానాలు ఆచరిస్తున్న భక్తులు,



కాళేశ్వరాలయంలో కిక్కిరిసిన క్యూలైన్లు



తీపిజ్ఞాపకం: ఎడ్లబండిపై వెళ్తూ సెల్ఫీ తీసుకుంటున్న యువతి

పుష్కర సంబురం

సరస్వతి నదిలో మూడోరోజు లక్షన్నర మంది స్నానాలు

- పిండ ప్రదానాలు, పితృ దేవతలకు తర్పనాలు
- భక్తులతో కిటకిటలాడిన కాళేశ్వరాలయ క్యూలైన్లు
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్, తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతిస్వామి పూజలు
- వర్షంతో బురదగా మారిన పార్కింగ్ స్థలాలు..

త్రివేణి సంగమం.. జన సంద్రమైంది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు నదీమ తల్లికి నీరాజనం పలికారు. పుష్కర స్నానమాచరించి పునీతులయ్యారు. పిండ ప్రదానాలు చేసి పితృదేవతలకు తర్పనాలు వదిలారు. గోదావరి మాతకు దీపాలు సమర్పించారు. హారతి ఇచ్చి అండగా నిలవమంటూ మొక్కులు చెల్లించుకున్నారు. హర హర మహదేవ అంటూ ముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. శనివారం లక్షన్నర మంది భక్తులు పుష్కర స్నానాలు ఆచరించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పీఠాధిపతులు ప్రత్యేక పూజలు చేశారు.

- భూపాలపల్లి/కాళేశ్వరం

- వివరాలు 8లో▸



నదికి నవరత్నమాల హారతి ఇస్తున్న కాశీ పండితులు

భూభారతి @ 3,197

- వర్ధన్నపేట మండలంలో రైతులు అందించిన దరఖాస్తుల సంఖ్య
- 1,415 సాదాబైనామా, 746 అసైన్డ్ భూముల అర్జీలు
- దరఖాస్తుల పరిశీలనకు నాలుగు ప్రత్యేక బృందాలు
- ఈ నెలాఖరునాటికి పూర్తి చేసేందుకు అధికారుల కసరత్తు

సాక్షి, వరంగల్: జిల్లాలో భూభారతి పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన వర్ధన్నపేట మండలంలో రైతుల నుంచి 3,197 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ సదస్సుల్లో 2,917, తహసీల్దార్ కార్యాలయంలో 280 దరఖాస్తులు ఇచ్చారు. వీటిలో అత్యధికంగా 1,415 సాదాబైనామాలు, ఆ తర్వాత అసైన్డ్ భూములకు సంబంధించి 746 అర్జీలు వచ్చాయి. వారసత్వ భూమార్పిడి కోసం ఏకంగా 192 దరఖాస్తులు వచ్చాయి. అలాగే సాగు చేసుకుంటున్న భూమికి.. పాస్ పుస్తకంలో నమోదైన విస్తీర్ణానికి పొంతన లేదు. ఉన్న భూమి కంటే తక్కువ నమోదైనవారు 155 మంది ఉన్నారు. మా సమస్యలు పరిష్కరించండి అంటూ రైతులు రెవెన్యూ సదస్సుల్లో పెద్ద ఎత్తున మొరపెట్టుకున్నారు. ఈ నెల ఐదు నుంచి మొదలైన రెవెన్యూ సదస్సులు 12 రెవెన్యూ గ్రామాల్లో తహసీల్దార్ విజయసాగర్ ఆధ్వర్యంలో రెండు బృందాలు నిర్వహించాయి. కలెక్టర్ డాక్టర్ సత్యశారద కూడా ఈ రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని రైతులకు భూభారతి చట్టంపై అవగాహన కల్పించారు. అర్జీల స్వీకరణ పర్యవేక్షించారు. రైతులతో భూసమస్యలపై మాట్లాడారు. రెవెన్యూ అధికారులు దరఖాస్తులు స్వీకరించి రైతులకు రసీదులు అందజేశారు. అలాగే ఈ సదస్సుల్లో దరఖాస్తులు ఇవ్వలేని వారు తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రెవెన్యూ గ్రామాల వారీగా నాలుగు బృందాలు ఇప్పటికే పని ప్రారంభించాయి. రైతులు సమర్పించిన దరఖాస్తుల ఆధారంగా విచారణ చేపట్టి నివేదికలను తయారుచేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ నెలాఖరు వరకు ఈ సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నారు.



భూభారతి సదస్సులో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద, తహసీల్దార్ విజయసాగర్ (ఫైల్)

రెవెన్యూ సదస్సులు, తహసీల్దార్ కార్యాలయంలో రైతులు సమర్పించిన దరఖాస్తుల వివరాలు..

దరఖాస్తులు	సంఖ్య
సాదాబైనామా	1,415
అసైన్డ్	746
వారసత్వ మార్పిడి	192
భూవిస్తీర్ణంలో తేడాలు	155
డీఎస్ పెండింగ్	45
మ్యుటేషన్ పెండింగ్	33
మిస్సింగ్ సర్వేనంబర్లు	30
ఇనామ్–ఓఆర్‌సీ జారీ	28
భూవివరణ	22
భూసేకరణ	5
పేరు సరిచేయుట	4
నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు	1
38–ఈ ధ్రువపత్రం	1
ఇతర దరఖాస్తులు	520

నాలుగు బృందాలతో పరిశీలన..



రెవెన్యూ సదస్సులో 2,917 దరఖాస్తులు, తహసీల్దార్ కార్యాలయంలో మరో 280 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం నుంచి వచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరిస్తాం. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు మాత్రం రూపొందిస్తున్నాం. మిగిలిన దరఖాస్తుల విషయమై ఇప్పటికే నాలుగు బృందాలు ఏర్పాటుచేసి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం. వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ఈ నెలాఖరునాటికి పూర్తి చేసేలా ముందుకెళ్తున్నాం. -విజయసాగర్, తహసీల్దార్, వర్ధన్నపేట

ఉమ్మడి జిల్లా రైల్వే ప్రాజెక్టుల సర్వేకు నిధులు

- 2025–26 కన్సాలిడేటెడ్ స్టేట్‌మెంట్‌లో స్పష్టత

కాజీపేట రూరల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు రైల్వే ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించిన ఫైనల్ లొకేషన్ సర్వేకు 2025–26 ఆర్థిక సంవత్సరం సంబంధించిన కన్సాలిడేటెడ్ బడ్జెట్‌లో కేటాయింపు చేసినట్లు శనివారం రైల్వే అధికారులు తెలిపారు.

ఏ ప్రాజెక్టుకు ఎంత అంటే..

- పెండ్యాల్–హసన్‌పర్తి బైపాస్‌లైన్ ఫైనల్ లొకేషన్ సర్వేకు రూ.64 లక్షలు, డోర్నకల్–మణుగూర్ డబ్లింగ్ 104 కిలోమీటర్ల థర్డ్‌లైన్ సర్వే కోసం రూ.2.08 కోట్లు, సికింద్రాబాద్–కాజీపేట మధ్య మూడవ లైన్ సర్వేకు రూ.1.56 కోట్లు కేటాయించారు.
- సికింద్రాబాద్–కాజీపేట వరకు 85,48 కి.మీ డబ్లింగ్ లైన్ సర్వే కోసం రూ.1.71 కోట్లు, కాజీపేట–విజయవాడ క్వార్డర్ అప్‌లింగ్ 220 కి.మీ సర్వేకు రూ.4.40 కోట్లు, కాజీపేట–బల్లార్షా క్వార్డర్ అప్ లింగ్ 234 కి.మీ సర్వేకు రూ.4.68 కోట్లు, కాజీపేట–సికింద్రాబాద్ క్వార్డర్ అప్‌లింగ్ 120 కి.మీ రూ.2.40 కోట్లు, భూపాలపల్లి–కాజీపేట (హసన్‌పర్తి) కొత్తలైన్ 64 కి.మీ ఫైనల్ సర్వేకు రూ.1.60 కోట్లు ఇచ్చారు.
- ఘన్‌పూర్–రఘునాథపల్లి 17,2 కి .మీ మూడవ, నాల్గవ లైన్ సర్వేకు రూ.0.34 లక్షలు, మణుగూరు–రామగుండం కొత్త లైన్ సర్వేకు రూ.5 కోట్లు, కాజీపేట–ఘన్‌పూర్ మధ్య 21.25 కి.మీ మూడవ రైల్వే లైన్ సర్వేకు రూ.43 లక్షలు కేటాయింపులు చేశారు.
- వరంగల్ స్టేషన్ సమీపంలో కి.మీ. రైల్ ఓవర్ రైల్ (ఆర్వోఆర్) మంజూరుకు రూ.10 లక్షలు, కాజీపేట–వరంగల్ రూట్‌లో బైపాస్‌లైన్‌లో రైల్ ఓవర్ రైల్ (ఆర్వోఆర్)కు రూ. 75 లక్షలు, డోర్నకల్‌లో 15 కి.మీ. ఆర్వోఆర్ సర్వేకు రూ.30 లక్షలు మంజూరు చేశారు.
- సికింద్రాబాద్–కాజీపేట మధ్య ప్రిలిమినరీ ఇంజనీరింగ్ కమ్ ట్రాఫిక్ 134 కి.మీ మూడవ లైన్ సర్వేకు రూ.52 లక్షలు, బల్లార్షా–కాజీపేట ప్రిలిమినరీ ఇంజనీరింగ్ కమ్ ట్రాఫిక్ 234 కి.మీ బల్లార్షా–కాజీపేట మధ్య నాలుగో లైన్ సర్వేకు రూ.1.17 కోట్లు, కాజీపేట–విజయవాడ మధ్య నాలుగో లైన్ 219 కి.మీ ప్రిలిమినరీ ఇంజనీరింగ్ కమ్ ట్రాఫిక్ రూ.1.10 కోట్లు నిధులు కేటాయించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.
- కాజీపేట రైల్వే వ్యాగన్ షెడ్‌కు సంబంధించిన ఈ ఏడాది కావాల్సిన నిధులు కన్సాలిడేటెడ్ బడ్జెట్ కేటాయింపుల్లో పేర్కొనలేదని అధికారులు పేర్కొన్నారు.

ఎంబీఏ పరీక్షలు షురూ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె.రాజేందర్ సందర్శించి, పరిశీలించారు. అలాగే కాకతీయ యూనివర్సిటీ పరిధిలో దూరవిద్య బీఎల్ఐఎస్‌సీ, ఎంఎల్ఐఎస్‌సీ పరీక్షలు కొనసాగుతున్నాయి.దూరవిద్య కేంద్రంలోని పరీక్షల కేంద్రాన్ని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం సందర్శించి, పరిశీలించారు. ఆయన వెంట దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో పంటలు సాగుచేయాలి

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట రూరల్: సేంద్రియ ఎరువులతో పంటలు సాగుచేస్తే అధిక దిగుబడి వస్తుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పేర్కొన్నారు. గురిజాల గ్రామ రైతువేదికలో శనివారం జరిగిన ‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో సేంద్రియ ఎరువులతో మనకు కావాల్సిన ఆహార ధాన్యాలను పండించుకోవాలని సూచించారు. రసాయన ఎరువులు వాడడం భూములకు మంచిదికాదన్నారు. అనంతరం రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు పలు సూచనలు, సలహాలు అందించారు. ఆదర్శ రైతులు కరుణాకర్, రామారావు, రవీందర్‌రెడ్డిని ఎమ్మెల్యే మాధవరెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయాధికారి అనురాధ, నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏడీఏ దామోదర్‌రెడ్డి, ఏఓ కృష్ణకుమార్, ఏఈఓలు అశోక్, శ్యాం, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

రైతులకు అన్యాయం చేయొద్దు

- డీసీఓ నీరజ, సివిల్ సప్లయీస్ డీఎం సంధ్యారాణి, జిల్లా అధికారి కిష్టయ్య
- ఖానాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, శ్రీనివాస రైస్‌మిల్లు తనిఖీ

ఖానాపురం: సొంత నిర్ణయాలతో మిల్లర్లు రైతులకు అన్యాయం చేయొద్దని జిల్లా సహకార శాఖ అధికారి నీరజ, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కిష్టయ్య అన్నారు. మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, శ్రీనివాస రైస్‌మిల్లును శనివారం వారు తనిఖీ చేశారు. మిల్లు వద్దకు లారీలు ఎప్పుడు వచ్చాయి, దిగుమతి ఎలా చేస్తున్నారు, రైతులు, మిల్లర్ల మధ్య ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ ధాన్యం దిగుమతుల్లో ఆలస్యం చేసి, రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 93,070 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. 18,716 మంది రైతుల ఖాతాల్లో రూ.105 కోట్ల నిధులు జమచేసినట్లు పేర్కొన్నారు. సన్నవడ్ల బోనస్ ఇప్పటి వరకు పడలేదని, ప్రభుత్వానికి పంపుతున్నట్లు వివరించారు. మిల్లర్లు కోతలు విధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోలర్ రాజయ్య, సివిల్ సప్లయీస్ డీటీ సంధ్యారాణి, సొసైటీ సిబ్బంది మేరుగు రాజు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఏఓ శ్రీనివాస్ మిల్లును తనిఖీ చేసి సూచనలు చేశారు.



శ్రీనివాస మిల్లును తనిఖీ చేస్తున్న డీఎం సంధ్యారాణి, డీఎస్ఓ కిష్టయ్య

ప్రొఫెసర్లుగా పదోన్నతి

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించారు. సంస్కృత అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఇ.కృష్ణయ్య, పొలిటికల్ సైన్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి, ప్రభుత్వ పింగిళి మహిళా కాలేజీ తెలుగు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీతకు ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పిస్తూ కళాశాల విద్యా కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన ప్రొఫెసర్లను కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, అధ్యాపకులు తదితరులు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఎం.రవికుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ శ్రీనాథ్, పరీక్షల నియంత్రణాధికారి శివనాగ శ్రీను, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా..

- మోడల్ స్కూళ్లు, కాలేజీల్లో నాణ్యమైన విద్యాబోధన
- ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులు
- ఇంటర్‌లో ప్రవేశాలకు ఈనెల 20వ తేదీ గడువు

నెక్కొండ: కార్పొరేట్, ప్రైవేట్‌కు దీటుగా విద్యనదించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం మోడల్ స్కూళ్లు, కళాశాలల (ఆదర్శ పాఠశాలలు/కళాశాలలు)ను ఏర్పాటు చేసింది. ఆంగ్ల మాధ్యమంలో బోధన, అధునాతన తరగతి గదులు, ప్రయోగశాలలు, నిపుణులైన అధ్యాపకులు ఉండడంతో ప్రవేశాలకు పోటీ పెరిగింది. 6 నుంచి 10వ తరగతితోపాటు ఇంటర్ విద్యను ఉచితంగా అందిస్తుడడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. 2025–26 విద్యాసంవత్సరానికి ఆదర్శ విద్యాలయాల్లో ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉంది.

ప్రతీ గ్రూపులో 40 సీట్లు..

జిల్లాలో మొత్తం 6 (నెక్కొండ, సంగెం, చెన్నారావుపేట, ఖానాపురం, పర్వతగిరి, గీసుకొండ) మోడల్ స్కూళ్లు, కాలేజీలు ఉన్నాయి. ప్రతీ కాలేజీలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులున్నాయి. ప్రతీ గ్రూపులో 40 సీట్లు ఉన్నాయి. కళాశాలల్లో బాలికలకు హాస్టల్ సౌకర్యం ఉంటుంది. అందుకు కనీసం మూడు కిలోమీటర్లు లేదా ఆపై దూరం ఉండేవారు మాత్రమే అర్హులని అధికారులు పేర్కొన్నారు.



నెక్కొండలోని మోడల్ స్కూల్, కళాశాల

అడ్మిషన్ల ప్రక్రియ ఇలా..

- జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు హెచ్‌టీటీపీ://183.82.97.97/ఎంఎస్‌టీజీలో దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 20 చివరి తేదీగా అధికారులు ప్రకటించారు.
- 22న దరఖాస్తుల పరిశీలనతోపాటు ఎంపికైన వారి జాబితాను సిద్ధం చేయనున్నారు.
- రిజర్వేషన్, మెరిట్ ఆధారంగా 26న ఎంపికైన వారి జాబితాను ప్రదర్శిస్తారు.
- 27 నుంచి 31వ వరకు విద్యార్హత ధ్రువపత్రాలను పరిశీలించి ప్రవేశాలు కల్పిస్తారు. జూన్ 2 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.
- ప్రతి గ్రూపులో 40 సీట్ల చొప్పున నాలుగు గ్రూపుల్లో 160 మందికి ప్రవేశాలు కల్పిస్తారు.
- పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు. అల్పాదాయ వర్గాల వారికి ప్రాధాన్యమిస్తారు.

ఉత్తమ ఫలితాలు సాధించాం..



మోడల్ స్కూల్ అధ్యాపకులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. నేను ఇంటర్ ఎంపీసీలో 974 మార్కులు సాధించాను. మా కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు పాటించి ఉత్తమ ఫలితాలు సాధించాం.

- మౌనిక, విద్యార్థిని, నెక్కొండ మోడల్ స్కూల్

కార్పొరేట్ తరహాలోనే..



మోడల్ స్కూల్, కళాశాలలో కార్పొరేట్, ప్రైవేట్‌కు దీటుగా తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా సంసిద్ధులను చేస్తున్నాం. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోపు ఇంటర్ చదివేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

- డాక్టర్ ప్రణయ్‌కుమార్, మోడల్ స్కూల్, ప్రిన్సిపాల్ నెక్కొండ

రాంపురంలో కుంట కట్ట ధ్వంసం

- ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయకట్టు రైతులు
- తహసీల్దార్, ఏఈ, సీఐకి ఫిర్యాదు

గీసుకొండ: మండలంలోని రాంపురం రామయ్యకుంట కట్టను కొందరు శనివారం ధ్వంసం చేసి అమ్ముకోవడానికి చేసిన ప్రయత్నం వివాదానికి దారితీసింది. కట్టతోపాటు చెట్లను తొలగించి చదును చేయడంతో ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన బండారు నరేందర్, శ్రీనివాస్ కుంట కట్ట భూమిని చదును చేసి అమ్ముకుందామనే ప్రయత్నాలు చేయడంతో రైతులు తహసీల్దార్ రియాజుద్దీన్, ఐబీ ఏఈ విజయలక్ష్మికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆకట్టపైనుంచి తాము పంటచేలకు వెళ్లే దారి ఉందని, అలాగే కట్టను తొలగిస్తే కింది భూములు ముంపునకు గురవుతాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. సుమారు 750 సంవత్సరాల నుంచి ఉన్న కుంట కట్టను ఎలాంటి హక్కులు లేని వారు తొలగించారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పరిశీలించిన తహసీల్దార్ ఎండీ రియాజుద్దీన్ మాట్లాడుతూ కుంట కట్టను తొలగించడం చట్ట ప్రకారం నేరమన్నారు. కట్టను తొలగించిన వారిపై ఐబీ ఏఈ.. గీసుకొండ సీఐ మహేందర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై విలేకరులు సీఐని వివరణ కోరగా విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రైతు రడం భరత్ మాట్లాడుతూ తమ పూర్వీకుల కాలం నుంచి ఉన్న కుంట కట్టను తొలగించడం సరికాదని, కట్టను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



రాంపురం రామయ్యకుంట కట్ట వద్ద రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఏఈ తదితరులు

రైల్వే లోకోపైలెట్ల గైర్హాజరుతో పది రైళ్లు రద్దు



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ కేంద్రంగా ప్రయాణిస్తున్న పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు, పుష్‌పుల్ ప్యాసింజర్ రైళ్లను లోకోపైలెట్ల గైర్హాజరుతో రద్దు చేసినట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు. లోకో పైలెట్లు డిపార్ట్‌మెంటల్ పరీక్షలు రాస్తున్నందున ప్యాసింజర్ రైళ్లను నడిపించే వారి కొరత ఏర్పడిందని, దాంతో పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను సికింద్రాబాద్ అధికారులు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. కాగా, పలు రైళ్ల రద్దుతో పాటు వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీ వ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పుష్ పుల్ ప్యాసింజర్ రైళ్ల రద్దు కావడంతో ఎక్స్‌ప్రెస్ రై ళ్లలో వెళ్లలేక సామాన్యులు ఇక్కట్లు పడుతున్నారు.

రద్దయిన ఎక్స్‌ప్రెస్ రైళ్లు

ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు కాజీపేట – బల్లార్షా (17035) వెళ్లే ఎక్స్‌ప్రెస్, ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు బల్లార్షా – కాజీపేట (17036) వెళ్లే ఎక్స్‌ప్రెస్, కాజీపేట – సిర్పూర్ కాగజ్‌నగర్ (17003) వెళ్లే ఎక్స్‌ప్రెస్, బల్లార్షా – కాజీపేట (17004) వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లు.

నిలిచిన పుష్‌పుల్ ట్రైన్స్

ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు సికింద్రాబాద్ – వరంగల్ (67761) వెళ్లే పుష్‌పుల్, వరంగల్ – సికింద్రాబాద్ (67762) పుష్‌పుల్, సికింద్రాబాద్ – కా జీపేట (67763) పుష్‌పుల్, కాజీపేట – సికింద్రాబాద్ (67764) పుష్‌పుల్, డోర్నకల్ – కాజీపేట (67766) పుష్‌పుల్, కాజీపేట డోర్నకల్ (67765) పుష్‌పుల్ రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు వివరించారు.

క్రైం ఏసీపీగా కిరణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

రామన్నపేట: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ క్రైం విభాగం నూతన ఏసీపీగా కిరణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌ను అధికారులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

పుష్కరం.. పునీతం


నీళ్లారగిస్తున్న మహిళ


స్నానమాచరిస్తున్న భక్తుడు


చిన్నారితో కలిసి స్నానం చేస్తున్న మహిళ


దీపారాధన చేస్తున్న మహిళలు


ఉత్సవ విగ్రహానికి జలాభిషేకం


పుణ్యస్నానం చేస్తున్న యువతులు


ఆలయానికి వస్తున్న సచ్చిదానంద సరస్వతి స్వామి


అంతర్వాహినిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


కాళేశ్వరాలయంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వలంటీర్


సొమ్మసిల్లి పడిపోయిన భక్తుడు


పుష్కర ఘాట్‌కు స్నానమాచరించేందుకు వెళ్తున్న భక్తులు


పార్కింగ్ స్థలంలో నిలిపిన వాహనాలు


చిత్తడిగా మారిన ఘాట్ రోడ్డు


స్నానాలు చేస్తూ సెల్ఫీ దిగుతున్న భక్తులు

డిప్యూటీ సీఎం కాలసర్ప పూజలు


కాలసర్ప పూజలు చేస్తున్న భట్టి దంపతులు

కాటారం/కాళేశ్వరం: సరస్వతి పుష్కరాల్లో భాగంగా సరస్వతి ఘాట్ వద్ద రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన సోదరుడు మల్లు ప్రసాద్‌తో కలిసి శనివారం తమ పితృదేవతలకు పిండప్రదానం చేశారు. అనంతరం పుష్కర స్నానం ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా భట్టికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కుటుంబ సమేతంగా స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో కాలసర్ప నివారణ పూజలు, స్వామి వారికి క్షీరాభిషేకం చేశారు. ఆలయ పురోహితులు వేద మంత్రోచ్ఛరణల మధ్య డిప్యూటీ సీఎం దంపతులకు ఆశీర్వచనం చేసి స్వామి వారి ప్రసాదం అందజేశారు.

హోరాహోరీగా నెట్‌బాల్ పోటీలు


ట్రెడిషనల్ ఫైనల్‌లో నారాయణపేట (విన్నర్), కరీంగనర్ (రన్నర్) జట్లు

జనగామ: జనగామ జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటలో రాష్ట్రస్థాయి 8వ సబ్ జూనియర్ అండర్ -16 నెట్‌బాల్ చాంపియన్ షిప్ -2025 పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి 620 మంది బాలబాలికలు హాజరయ్యారు. ట్రెడిషనల్, ఫాస్ట్ -5, మిక్స్‌డ్ నెట్‌బాల్ పోటీల్లో మూడు కేటగిరీల వారీగా క్రీడాకారులు తలపడుతున్నారు. ఇందులో ట్రెడిషనల్, ఫాస్ట్ -5 రెండు కేటగిరీలకు సంబంధించి బాలుర, బాలికల లీగ్, క్వార్టర్, సెమీ, ఫైనల్ మ్యాచ్‌లు ముగిశాయి. మిక్స్‌డ్ డబుల్ నెట్‌బాల్ పోటీలు శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి.

రెండు కేటగిరీల్లో నారాయణపేట, మేడ్చల్ హవా

ట్రెడిషనల్, ఫాస్ట్ -5 నెట్‌బాల్ పోటీల్లో బాలుర, బాలికల విభాగంలో నారాయణపేట, మేడ్చల్ జిల్లాల హవా కొనసాగింది. ట్రెడిషనల్ నెట్‌బాల్ బాలుర 8వ పోటీల్లో నారాయణపేట (విన్నర్), కరీంనగర్ (రన్నర్), హైదరాబాద్, ఖమ్మం (థర్డ్/సంయుక్తంగా), బాలికల విభాగంలో మేడ్చల్ (విన్నర్), నల్లగొండ (రన్నర్), జనగామ, ఖమ్మం (థర్డ్/సంయుక్తంగా) విజయకేతనం ఎగుర వేశాయి. ఫాస్ట్ -5 నెట్‌బాల్ బాలుర 4వ పోటీల్లో నారాయణపేట (విన్నర్), ఖమ్మం (రన్నర్), మహబూబ్‌నగర్, కొమురం భీం ఆసిఫాబాద్ (థర్డ్ /సంయుక్తంగా), బాలికల విభాగంలో మేడ్చల్ (విన్నర్), ఖమ్మం (రన్నర్), జనగామ, కొమురంభీం ఆసిఫాబాద్ (థర్డ్/సంయుక్తంగా) బరిలో దిగి గెలుపొందాయి. మిక్స్‌డ్ డబుల్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగియనున్నాయి. ముగింపు వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయనున్నారు.


ఫాస్ట్ -5 ఫైనల్‌లో గెలుపొందిన మేడ్చల్ బాలికల టీం

పితృ దేవతలకు పిండ ప్రదానాలు

- సరస్వతి నది పుష్కరాల్లో సమర్పణ
- పుష్కరాల్లో పెద్దలకు సమర్పిస్తే మోక్షం
- వారి ఆత్మలు శాంతిస్తాయని భక్తుల నమ్మకం

కాటారం: కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి పుష్కరాల్లో భక్తులు పుష్కర స్నానం, ప్రత్యేక పూజలతో పాటు పిండ ప్రదానాలు, పితృ తర్పణాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పన్నెండేళ్లకు ఒకసారి ఒక్కో నదికి వచ్చే పుష్కరంలో పితృదేవతలకు సమర్పణ ఆనవాయితీగా వస్తోంది. ఒక్కో రాశి బృహస్పతి (గురువు)లో ప్రవేశించడంతో ఒక్కో నదికి ఒక్కో ఏడాది పుష్కరం వస్తుంది. ఇలా 12 నదులకు 12 ఏళ్లకు ఒకసారి పుష్కరాలు వస్తుంటాయి. ఈ పుష్కరాల్లో స్నానం ఆచరిస్తే సకల రోగపీడలు తొలగిపోతాయని భక్తులు విశ్వసిస్తారు. అంతేకాకుండా, తమ కుటుంబంలో కాలం చేసిన పితృదేవతలకు పిండ ప్రదానాలు, పితృ తర్పణాలు సమర్పిస్తే వారి ఆత్మకు శాంతి కలిగి మోక్షం చేకూరుతుందని భక్తులు నమ్ముతారు. ఈ ఏడాది మిథున రాశి బృహస్పతిలో ప్రవేశించడంతో కాళేశ్వరంలో అంతర్వాహినిగా కొనసాగుతున్న సరస్వతి నదికి పుష్కరాలు వచ్చాయి. పన్నెండు రోజుల పాటు కొనసాగనున్న పుష్కర వేడుకలకు తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించడంతో పాటు పురోహితుల సమక్షంలో పితృదేవతలకు పిండ ప్రదానాలు, పితృ తర్పణాలు చేసి నదిలో సంకల్పాలు చేస్తున్నారు. ప్రతీ పుష్కరంలో నది తీరాన ముప్పై మూడు కోట్ల దేవతలతో పాటు పితృదేవతలు మచ్చ రూపంలో కొలువై ఉంటారని పురోహితులు, వేద బ్రహ్మణులు చెబుతున్నారు. ప్రతీ నది పుష్కరంలో పితృదేవతలకు పిండ ప్రదానాలు, పితృ తర్పణాలు చేయడం వల్ల వారికి మోక్షం కలుగుతుందని పేర్కొంటున్నారు.


గోదావరి నది తీరంలో పితృ దేవతలకు పిండ ప్రదానం చేస్తున్న భక్తులు

పితృ దేవతలను స్మరించుకుంటా..



గతంలో జరిగిన గోదావరి, ప్రాణహిత పుష్కరాల్లో పాల్గొని మా పితృదేవతలను స్మరించుకుంటూ పిండ ప్రదానం, సంకల్పం చేశాను. ఇప్పుడు కూడా మా పెద్దలకు పిండ ప్రదానం గావించాను. పురోహితుడి ఆధ్వర్యంలో మా పెద్ద పేరు మీదుగా సమర్పణ కార్యక్రమం జరిపించాను.

- జీరాసింగ్, నిజామాబాద్

పెద్దల ఆశీస్సులు ఉండాలని..



స్వర్గస్తులైన మా పితృ దేవతల ఆశీస్సులు మా కుటుంబ సభ్యులపై ఎల్లవేళలా ఉండాలని వారికి పిండ ప్రదాన కార్యక్రమం జరిపించాను. వారు మా మధ్య లేకపోవడంతో బాధాకరం. అయినప్పటికీ వారిని స్మరించుకొని పిండప్రదానం చేయడం వల్ల కొంతమేర బాధ తొలగిపోయింది.

- సుధాకర్, హనుమకొండ

పితృ దేవతలకు స్వర్గలోక మోక్షం..



ఒక్కో రాశి ఒక్కో ఏడాది గురుడులోకి ప్రవేశిస్తుంది. దాంతో 12 నదులకు ఒక్కో ఏడాది పుష్కరం వస్తుంది. ఈ పుష్కరాల సమయంలో కోట్లాది దేవతలతో పాటు పితృదేవతలు నదితీరంలో ఉంటారు. కాలం చేసిన పితృదేవతలకు ఈ సమయంలో పిండ ప్రదానం, పితృ తర్పణాలు చేస్తే వారికి స్వర్గలోక మోక్షం కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఈక్రమంలో ప్రతీ పుష్కరంలో పితృదేవతల పేరిట పూజలు చేయడం శుభప్రదం.

- వెంకటశివయ్య, పురోహితుడు, శ్రీశైలం

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించిన కలెక్టర్ రాహుల్, ఎస్పీ కిరణ్


బైక్‌పై వెళ్తున్న కలెక్టర్, ఎస్పీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో సరస్వతి నది పుష్కరాల సందర్భంగా మూడో రోజు కాళేశ్వరానికి భక్తుల రద్దీ పెరిగింది. శనివారం వివిధ ప్రాంతాల నుంచి వాహనాల్లో కాళేశ్వరం బయలుదేరగా మహదేవపూర్ – కాళేశ్వరం రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈక్రమంలో వాహనాలను క్రమబద్ధీకరించేందుకు కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ బైక్‌పై తిరుగుతూ వాహనాలను పంపించి రూట్ క్లియర్ చేశారు. కాగా, శని, ఆది వారాల్లో భక్తుల రద్దీ తీవ్రంగా ఉంటుందని అంచనా వేసి యంత్రాంగాన్ని వారు అప్రమత్తం చేశారు.

ప్రపంచంతో పోటీపడేలా ప్రభుత్వ పాలన

- సరస్వతి పుష్కరాల నిర్వహణ భేష్
- ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి తుమ్మల


పూజలు చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రఘురామిరెడ్డి, తదితరులు

కాటారం/కాళేశ్వరం: సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాష్ట్రం ప్రపంచంతో పోటీపడేలా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని, ముక్తీశ్వర స్వామి ఆశీర్వాదం ఉంటే మరింత ముందుకు వెళ్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి నది పుష్కరాల్లో భాగంగా ఉప ముఖ్యమంత్రి, మంత్రి, ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి వేర్వేగా శనివారం పుష్కర స్నానం ఆచరించి సరస్వతి అమ్మవారు, కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి తుమ్మల వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా పుష్కరాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలు ఎంతో పవిత్రమైనవని, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించాలని సూచించారు. రాష్ట్రంలో గోదావరి పుష్కరాలు భారీగా నిర్వహించడానికి ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, మక్కాన్‌సింగ్, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, భూపాలపల్లి ఆర్డీఓ రవి, దేవాదాయశాఖ ఆర్జేసి రామకృష్ణారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో వర్ష బీభత్సం


గాలిదుమారానికి కూలిన టెంట్

భూపాలపల్లి/కాళేశ్వరం: సరస్వతి పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు వస్తున్న సమయంలో అకాల వర్షం బీభత్సం సృష్టించింది. కాళేశ్వరంలో శుక్రవారం రాత్రి భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో త్రివేణి సంగమం పుష్కర ఘాట్ తీరాన ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు నేలకూలాయి. పలుగుల బైపాస్ రోడ్, బస్టాండ్, వీఐపీ ఘాట్ రోడ్, టెంట్ సిటీ, సరస్వతి మాత విగ్రహం వెనుక, సాధారణ ఘాట్ వద్ద గల భారీ హోర్డింగ్‌లు, ఫ్లెక్సీ కటౌట్‌లు కూలిపోయాయి. రాత్రివేళ ఈదురుగాలులు వీయడంతో ఎటువంటి ప్రమాదమూ వాటిల్లలేదు. 120 ఎకరాల్లో ఉన్న పార్కింగ్ స్థలాలు రేగడి భూముల్లో ఉండటంతో వాహనాలను శుక్రవారం ఉదయం వరకు బయటకు తీయలేని పరిస్థితి నెలకొంది. వర్ష బీభత్సం జరిగిన వెంటనే రాత్రి కలెక్టర్ రాహుల్ శర్మ పలు ప్రాంతాలను సందర్శించారు. శనివారం ఉదయం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ, మరమ్మతు పనులు చేపట్టారు.

ఎడ్ల బండ్లకు పెరిగిన గిరాకీ


పుష్కర స్నానం చేసి ఎడ్ల బండ్లపై వెళ్తున్న భక్తులు

భూపాలపల్లి అర్బన్: కాళేశ్వరం పుష్కరాల్లో భాగంగా సరస్వతి ఘాట్ వద్ద ఎడ్ల బండ్లకు గిరాకీ పెరిగింది. శుక్రవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా రోడ్లన్నీ బురదమయంగా మారాయి. దాంతో బురద రోడ్లపై వాహనాలు ముందుకు సాగక భక్తులు ఇబ్బందులు పడ్డారు. కార్లు, వాహనాలను దూరంగా పార్కింగ్ చేసి కాలినడకన వెళ్లలేక ఎడ్ల బండ్లను ఆశ్రయించారు. ఎడ్లబండ్ల యజమానులు ఒక్కరికి రూ.50 చొప్పున చార్జీ వసూలు చేస్తున్నారు. పట్టణాల నుంచి వచ్చిన భక్తులు ఎడ్ల బండ్లపై ప్రయాణం చేస్తూ సంబురపడుతూ, సెల్ఫీలు తీసుకుంటున్నారు.

నేటి నుంచి జాయ్‌రైడ్స్


కన్నెపల్లి వద్ద జాయ్‌రైడ్స్‌కు సిద్ధంగా ఉన్న హెలికాప్టర్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జాయ్‌రైడ్స్‌కు ఆదివారం నుంచి హెలికాప్టర్ చక్కర్లు కొట్టనుంది. కన్నెపల్లిలోని లక్ష్మీ పంపుహౌస్ వద్ద భక్తులు విహంగ వీక్షణం చేయడానికి ఏవియేషన్ అధికారులు అందుబాటులోకి తీసుకువచ్చారు. యాత్రధామ్.ఓఆర్‌జీ యాప్‌లో ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని, జాయ్‌రైడ్స్, టెంట్‌సిటీ, దేవస్థానం పూజలను ఈ యాప్‌లో పొందుపర్చినట్లు వివరించారు. జాయ్‌రైడ్స్ బుకింగ్ కోసం ఒక్కరికి రూ.4,500తో 6 – 7 నిమిషాల పాటు గాలిలో చక్కర్లు కొట్టనున్నారు. కన్నెపల్లి హెలిపాడ్ వద్ద హెలికాప్టర్ సిద్ధంగా ఉంది. టెంట్‌సిటీకి ఒక రోజుకు రూ.3వేల వరకు తీసుకుంటున్నట్లు ప్రతినిధులు పేర్కొన్నారు.

పోలీస్ వర్సెస్ ఎండోమెంట్

కాళేశ్వరం: సరస్వతి నది పుష్కరాల్లో రోజుకో ఘటన చోటుచేసుకుంటోంది. కాళేశ్వరం దేవస్థాన ఉపప్రధాన అర్చకుడు తన బంధువులను తోడ్కొని రాజగోపురం నుంచి ప్రధాన ఆలయంలోకి శనివారం వెళ్తుండగా పోలీసులు అడ్డుకొని అనుమతివ్వలేదు. దేవస్థాన అర్చకుడిని అని చెప్పినా పోలీసులు వినలేదు. భక్తుల ఎదుట తమపైకి ఓ ఎస్సై, ఏఎస్సై, ఓ కానిస్టేబుల్ వస్తూ వెకిలి చేష్టలు చేసి నాగిని నృత్యం చేస్తూ తొడకొట్టినట్లు ఆ అర్చకుడు వాపోయాడు. పోలీసుల కుటుంబాలను మాత్రం పదుల సంఖ్యలో లోపలికి అనుమతిస్తున్నారని, తమ బంధువులు వస్తే వెళ్లనివ్వరా అని ఆగ్రహం వ్యక్తం చేశాడు. అనంతరం డీఎస్పీ స్థాయి అధికారి అక్కడికి వచ్చి ఇరువురికి నచ్చజెప్పి గొడవను సద్దుమణిగించారు. కానిస్టేబుల్‌ను కూడా మందలించినట్లు సమాచారం. మూడు రోజులుగా పోలీసు, ఎండోమెంట్ శాఖల మధ్య ఘర్షణ జరుగుతోంది. ఆ రెండు శాఖల మధ్య సమన్వయం లోపించిందని భక్తులు అంటున్నారు. ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేసి పోలీసు, అధికారులను లోపలికి పంపిస్తే బాగుంటుందని ఓ అధికారి అభిప్రాయం వ్యక్తం చేశారు.